




www.manavaarthamirror.com

# మన వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సంపుటి 02 — సంచిక 115 — రంగారెడ్డి — ఆదివారం 20 సెప్టెంబర్ 2026 — ఎడిటర్ :శ్రీధర్‌యాదవ్ — పేజీలు :8 — వేల:4/రూ


## సిద్ధిపేటలో ఆక్రమించుకున్న భూముల్లో పేదలకు ఇళ్లు నిర్మిస్తాం

- నూనూగు మీసాల కెటిఆర్ కొడుకుకి 40 ఎకరాల భూమి ఎలా వచ్చింది.
- అసైన్డ్ భూముల పట్టాదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టం
- కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై సర్వే అనంతరం వాస్తవాలు వెల్లడిస్తాం
- మీడియా చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి



భూములపై నెలకొన్న వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలంటే రికార్డులు, భౌతిక పరిస్థితి రెండింటినీ సమన్వయం చేయాల్సి ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రికార్డులో ఉన్న భూమి ఎంత? డాక్యుమెంట్లలో ఎంత? భౌతికంగా ఎవరి పొజిషన్‌లో ఎంత ఉంది? ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? అన్నది సమగ్ర సర్వే ద్వారా తేలుస్తాం. వాస్తవాలు బయటకు వచ్చిన తర్వాత చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మిగతా2లో...

### ప్రైవేట్ వర్సిటీలను లాభార్జన కోసం

## నిర్వహించకూడదు

**- ఆడిట్ ఖాతాలను సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశం**



యూనివర్సిటీలను లాభం కోసం నిర్వహించకూడదని సుప్రీం కోర్టు గురువారం తెలిపింది. ప్రజల విద్యా లక్ష్యాలను పూర్తి చేసే ఉద్దేశం వాటికి ఉండాలని పేర్కొంది. కేవలం లాభాలు సంపాదించుకొనే వ్యాపారం లా విద్యను చూసే సంస్థలను అనుమతించొద్దని ప్రభుత్వాలను కోరింది. అన్ని విశ్వవిద్యాలయాల ఆడిట్ చేసిన ఖాతాలను ఆరు వారాల్లోగా తమకు సమర్పిం చాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ను ఆదేశించింది. ఆ ఖాతా ల్లో మిగులు ఆదా యం, వ్యయం, వసూలు చేసిన రుసుముల వివరాలు ఉండాలని స్పష్టం చేసింది. అమిటీ యూనివర్సిటీ కాలేజీ రికార్డుల్లో తన పేరు మార్చుకోవాలని ప్రయత్నించిన ఓ విద్యార్థిని తనను యాజమాన్యం వేధించిందని దాఖలు చేసిన కేసులో కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

## వాళ్లలాగా నేను కబ్జాలు పెట్టలేదు: హరీష్ రావు



ఎన్నికల అఫిడవిట్లలో తన భూములు, ఆస్తుల వివరాలు సుస్పష్టంగా చెప్పానని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు తెలిపారు. సర్వే నెంబర్లతో సహా భూముల వివరాలు ఇచ్చానని, కాంగ్రెస్ వాళ్లు సిద్దిపేటకు వస్తున్నారని, తన భూములు చూసి పోతారని, వందల మంది పోలీసులు, బుల్లెట్ ప్రూఫ్ బండ్లు. రోప్ పార్టీలు ఎందుకు, డ్రోన్లు పెట్టి ఫోటోలు తీయడం ఎందుకు అని ప్రశ్నించారు. సిద్ధిపేటలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. తాను ఇక్కడే ఉన్న తనకు చెబితే అన్ని ఏర్పాటు చేస్తానని, మంచిగా కడుపు నిండ అన్నం తినిపించి దగ్గరుండి కంటి నిండా తోట అన్నీ చూపిస్తానన్నారు. కాకుంటే ఉన్నది ఉన్నట్లు చెప్పండని, అబద్ధాలు చెప్పకండని తన జీవితం తెరిచిన పుస్తకం అని తెలియజేశారు. రామంచలలో 13 ఎకరాలు ఉంటే లేని పోనీవి చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను దాచింది ఏముంది కాంగ్రెసోళ్లు కొత్తగా బయట పెట్టేది ఏముందని అడిగారు. కాంగ్రెస్ నాయకులు లాగా తాను కబ్జాలు పెట్టలేదని, ప్రజల మిగతా2లో...

### తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

## నిరవధిక వాయిదా..



ఎనిమిది రోజుల పాటు వాడీవేడిగా సాగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. మొత్తం 51 గంటల 52 నిమిషాల పాటు కొనసాగిన సభలో ప్రశ్నలు, చర్చలు, సభ్యుల ప్రసంగాలు, మిగతా2లో...



## సమన్వయంతో పని చేయాలి

**ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణపై సమీక్షలో సీఎస్ సంజయ్ జాజు**

డిసెంబర్ 11 నుంచి 22 వరకు హైదరాబాద్ సహా హన్మకొండ, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం వేదికగా జరుగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను (అండర్-18) సమన్వయంతో

## రైతులు, మిల్లర్ల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ఉత్తమ్



తెలంగాణలో రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలకంగా ముందడుగు వేసింది. అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మిల్లర్ల ప్రతినిధులతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. సానుకూల వాతావరణంలో జరిగిన చర్చల్లో మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పెనాల్టీలు, టెండర్ ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, పెండింగ్ సరఫరాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. మిల్లర్లను ప్రభుత్వం ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా చూస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రైతుల ప్రయోజనాలు.. ప్రజాధనం పరిరక్షణతో పాటు మిల్లింగ్ రంగం స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. మిల్లర్లపై అనవసర భారం మోపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. మిల్లర్లు సమర్పించిన వినతులను సానుకూలంగా మిగతా2లో...

## ‘ప్రజాస్వామ్యం’ కన్నీరు తుడిచిన హైకోర్టు!..

- ప్రజా ప్రాతినిధ్య చట్టంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు
- స్పీకర్ ట్రిబ్యునల్ నిర్ణయానికి భిన్నంగా హైకోర్టు తీర్పు
- ఎమ్మెల్యేల పార్టీ మార్పులపై కీలక సంకేతాలు
- తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో మార్పులకు అవకాశం




పార్టీ ఫిరాయింపుల అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థలో ఓటర్ల తీర్పుకు ఉన్న ప్రాధాన్యత, రాజ్యాంగ విలువల పరిరక్షణపై ఈ తీర్పు గుర్తుపై గెలిచి అనంతరం మరో పార్టీలోకి వెళ్లే ఎమ్మెల్యేల విషయంలో న్యాయస్థానాల జోక్యం భవిష్యత్ రాజకీయ పరిణామాలకు ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. **ఫిరాయింపుల రాజకీయానికి హెచ్చరిక సంకేతం** తెలంగాణ రాజకీయాల్లో

## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల




తెలంగాణ ఆర్టీసీలో కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబరు 9న ఎన్నికలు నిర్వహించి, 17న ఫలితాలు వెల్లడించనున్నట్టు అధికారులు సంఘం ఎన్నికలు నిర్వహించగా.. మళ్లీ ఇప్పుడు జరుగుతున్నాయి. **ఎన్నికల పూర్తి షెడ్యూల్ వివరాలు** సెప్టెంబర్ 21 (సోమవారం): పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న యూనియన్లు సమ్మతి పత్రాలను సమర్పించడం. సెప్టెంబర్ 22 (మంగళవారం): ఆయా డిపో మేనేజర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను సంబంధిత జిల్లాల డిప్యూటీ రిటర్నింగ్ అధికారులకు అందజేయడం, యూనియన్ల నుంచి అభ్యంతరాలు కోరడం. సెప్టెంబర్ 24 (గురువారం): ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు ఆఖరి తేదీ. సెప్టెంబర్ 25 (శుక్రవారం): సంబంధిత డిపో మేనేజర్లు/యూనిట్ అధికారులతో చర్చించి అభ్యంతరాలను పరిష్కరించి తుది రూపు ఇవ్వడం. సెప్టెంబర్ 26 (శనివారం): పోటీ చేసే



## ఈ నెల 28 నుంచి బంగారు ఉంగరం పథకం

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సెప్టెంబర్ 28న నవజాత శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. తొలి విడత పంపిణీ కోసం 1.28

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



**కల్వకుర్తి సెప్టెంబర్ 19 వార్త మిర్రర్ ప్రతినిధి:-** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. శ్రీకాంత్ కాలనీలో అన్ని సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. 8వ వార్డు సంకటోనిపల్లి బీసీ కాలనీలో రూ.40 లక్షలు, 9వ వార్డు శ్రీకాంత్ కాలనీలో రూ.40 లక్షలు, 10వ వార్డు విటాయిపల్లి, పెండ తండాలో రూ.50 లక్షలు, 11వ వార్డు పద్మశాలి కాలనీలో రూ.30 లక్షలు, 12వ వార్డులో రూ.40 లక్షలతో పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆమనగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో ఆయా కాలనీల్లో రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తలకొండపల్లి మండలం గట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గణేష్ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమిళనాడు రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ మంత్రి పి. మదన్‌రాజాతో కలిసి సెరికల్చర్ రిసోర్స్ సెంటర్‌ను సందర్శించారు. కేంద్రం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, పట్టు పరిశ్రమకు సంబంధించిన అంశాలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు, వార్డు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గట్టుపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యమే ఆయుధంగా యువతకు ఉపాధి

**కల్వకుర్తి సెప్టెంబర్ 19 వార్త మిర్రర్ ప్రతినిధి:** తెలంగాణ యువతను భవిష్యత్ సాంకేతిక రంగానికి సిద్ధం చేయడంతో పాటు, నైపుణ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా 'టాస్క్--డెల్ టెక్నాలజీస్' భాగస్వామ్యంతో 'యుడాన్' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టాస్క్ ముఖ్య నిర్వహణ అధికారి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా యువతకు కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలు, డిజిటల్ నైపుణ్యాలు వంటి అంశాల్లో శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా ఆధునిక సాంకేతిక శిక్షణ అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం వెతకడం కాకుండా, విద్యార్థులు చదువుకుంటున్న సమయంలోనే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకునేలా సమగ్ర శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగాలు, శిక్షణతో కూడిన ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి దిశగా యువత ముందుకు వెళ్లేలా 'యుడాన్' కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. 5,500 మంది విద్యార్థులకు శిక్షణ'యుడాన్' కార్యక్రమం ద్వారా తెలంగాణలో 5,500 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. రాష్ట్రంలోని 25 కేంద్రాల్లో మూడు నెలలపాటు శిక్షణ కొనసాగుతుంది. సాంకేతిక నైపుణ్యాలతో పాటు పరిశ్రమల పరిచయం, ఉద్యోగాలకు అవసరమైన సామర్థ్యాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఐఐటీ ఢిల్లీ రూపొందించిన పాఠ్య ప్రణాళిక ఆధారంగా శిక్షణ అందించనుండగా, డెల్ టెక్నాలజీస్ సాంకేతిక



సహకారం అందించనుంది. కృత్రిమ మేధస్సు, మేఘ గణన, ఎలక్ట్రానిక్స్ తయారీ తదితర రంగాల్లో యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన సాంకేతిక కేంద్రాల్లో 'యుడాన్' కార్యక్రమాన్ని అమలు చేయనుండగా, హైదరాబాద్‌కు కూడా ఇందులో ప్రత్యేక అవకాశం లభించింది. ప్రభుత్వం, టాస్క్, డెల్ టెక్నాలజీస్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సమన్వయంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నారు. యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందించడంతో పాటు వాటిని ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేయడమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర మండలి కార్యదర్శి రామ్, టాస్క్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నితిన్ కుమార్‌రెడ్డి, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ముఖ్య నిర్వహణ అధికారి నిఖిల్, డెల్ టెక్నాలజీస్ ప్రభుత్వ వ్యవహారాల సీనియర్ ఖాతా నిర్వాహకుడు కె. కృష్ణకిషోర్, హైదరాబాద్ కేంద్ర ప్రాదేశిక సమాచార సాంకేతిక అధికారి రమేష్ జంపుల తదితరులు పాల్గొన్నారు.

# వెల్లుల్ల లో భగవాన్ బలరామ విగ్రహ ఆవిష్కరణ



**వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 19**జాతీయ అధ్యక్షులు కొండెల సాయి రెడ్డి, రైతుదినోత్సవ సాప్తాయిక్ కార్యక్రమాలలో భాగంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం వెల్లుల లో భగవాన్ బలరామ విగ్రహ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి సుమారు మూడు వందల మంది సభ్యులు వివిధ గ్రామాల నుండి హాజరుకాగా అందులో 50 మంది మహిళా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి కే ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కాసారం భూమరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి అధిష్టాన దేవుడైన బలరామ విగ్రహ ప్రతిష్టాపన చేసుకుని ఆ యొక్క గ్రామస్తులు రైతులు మంచి అనుభూతి పొందారు. ఇలాగే ప్రతి గ్రామాలలో రైతు సంఘాలుగా ఏర్పడి మన సమస్యలను పరిష్కరించుకునే దిశలో పయనిస్తున్నటువంటి సంఘం ఒకటి ఉన్నది అంటే అది భారతీయ కిసాన్ సంగ్ మాత్రమే కనుక జగిత్యాల జిల్లాలో అన్ని గ్రామాలలో కిసాన్ సంగ్ సభ్యత్వం నమోదు చేసుకొని మన సమస్యలు మనమే తీర్చుకుందాం అన్నారు. కార్యక్రమం అయిన వెంటనే, రైతులు ఎంతో ఆశతో చూస్తున్న వర్షభగవానుడు వర్షం కురిపించాడు. దీనితో గ్రామస్తులు ఒక శుభ సూచకంగా భగవాన్ బలరాముని అనుగ్రహంగా భావించి ఆనందపడ్డారు. ఈ కార్యక్రమంలో బికేఎస్ జాతీయ అధ్యక్షులు శ్రీ కొండెల సాయి రెడ్డి, హైదరాబాద్ జిల్లా బికేఎస్ అధ్యక్షులు జి వినోద్ కుమార్, కోరుట్ల మాజీ శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మెట్ పల్లి మాజీ ఎంపీపీ మారు సాయి రెడ్డి, జగిత్యాల జిల్లా బికేఎస్ అధ్యక్షులు కాసారం భూమ రెడ్డి, వెల్లుల్ల గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి, ఉపసర్పంచ్ అనిరెడ్డి శేఖర్, బికేఎస్ జగిత్యాల జిల్లా కార్యదర్శి ఇప్ప రాజేందర్, జోనల్ అధ్యక్షులు రావుల లింగారెడ్డి, బికేఎస్ జగిత్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుమల శంకర్, అల్లూరి అనిల్ రెడ్డి, మెట్ పల్లి మండల బికేఎస్ అధ్యక్షుడు ముకుంద రాజేష్, వెల్లుల్ల బికేఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజ్ కుమార్, బికేఎస్ రాయికల్ మండల అధ్యక్షులు బోడుగశీ శైలేశీదర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు..

## తాజ్ పూర్ గ్రామంలో సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్ అధ్యక్షతన ప్లాన్ ప్రాసెస్ ప్రత్యేక గ్రామసభ

**-ముఖ్య అతిధులుగా పాల్గొన్న భువనగిరి**
**(ఎం పి డి ఓ) విజయలక్ష్మి, (ఎంపీ ఓ) దినకర్, (ఏ పి ఓ) బాలస్వామి**
**-అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకుంటుంది**
**- ఎం పి డి ఓ విజయలక్ష్మి**

**యాదాద్రి మన వార్త మిర్రర్ ప్రతినిధి** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో 2026 జులై 1 నుండి స్థానంలో అమల్లోకి వచ్చిన కొత్త గ్రామీణ ఉపాధి పథకంలో ని వివిధ అంశాల పట్ల అవగాహన కల్పించడం కోసం విలేజ్ మ్యాపింగ్ గ్రామ పటీకరణ గ్రామంలో ఉన్న ప్రతి వనరు, మౌలిక సదుపాయం, భూమి, ఇళ్లు, రోడ్లు, నీటి వనరులు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, వ్యవసాయ భూములు, ప్లాట్లు, పబ్లిక్ స్థలాలు మొదలైన వాటిని స్పష్టంగా గుర్తించి, విలేజ్ మ్యాప్‌లో చూపించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు గా పాల్గొన్న ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ.. తాజ్ పూర్ గ్రామం పరిశుభ్రత లో, చెత్త విభజన మరియు సేకరణ లో, ప్రభుత్వ పాఠశాల మరమ్మత్తులలో, మొక్కల పెంపకం మరియు నిర్వహణలో నీటి సరఫరా, మొదలగు మౌలిక సదుపాయాలతో పాటు అన్ని రంగాల్లో పురోగతిని సాధిస్తూ ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంటుందని కొనియాడారు. సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండల స్థాయిలోని ప్రత్యేకంగా మా యొక్క గ్రామంలో ఈ యొక్క గ్రామసభ ఏర్పాటు కు అవకాశం ఇచ్చిన అధికార యంత్రాంగానికి, విచ్చేసిన వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, టిఏ లకు,ఫీల్డ్ అసిస్టెంట్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు..మా గ్రామం లో పరిశుభ్రత, చెత్త నాలుగు రకాల విభజన లో, ప్లాస్టిక్ నివారణకు మేము గ్రామంలో స్వంత ఖర్చులతో స్టీల్ ప్లేట్లు, గ్లాస్ ల వాడకాన్ని ఆచరించడం ,డంపింగ్ యార్డులో సేంద్రియ ఎరువు తయారీ విధానం వంటి అంశాల్లో మెంగ్గా ముందుకు సాగుతున్నాము అన్నారు...ఈ కార్యక్రమం లో సామాజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్,వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ఈ సి, టి ఏ లు,ఫీల్డ్ అసిస్టెంట్ లు ,ఉపసర్పంచ్,పాలకవర్గ సభ్యులు ,గ్రామ పె ద్దలు, మహిళలు, యువజన సంఘాలు,విద్యార్థుల ు,గ్రామప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




## బీజేవైఎం యువ నాయకుడుకి ఘన నివాళి



**కల్వకుర్తి సెప్టెంబర్ 19 వార్తా మిర్రర్ ప్రతినిధి:-** కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి జంపుల అరవింద్ అకాల మరణం బీజేపీ శ్రేణులను తీవ్రంగా కలచివేసింది. యువ నాయకుడిగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కార్యకర్తలతో సన్నిహితంగా ఉండే అరవింద్ ఇక లేరన్న విషయం బాధాకరమని నాయకులు భావోద్వేగానికి గురయ్యారు. అరవింద్ పార్థివదేహానికి బీజేపీ నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

## భువనగిరి పట్టణంలోని గణేష్ మండపాలను



## సందర్శించిన- జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

**భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను జరుపుకుందాం....! పరస్పర సహకారంతో శాంతి భద్రతలను కాపాడుకుందాం.!**

**యాదాద్రి మన వార్త మిర్రర్ ప్రతినిధి**యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలోని గణనాధులను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద భక్తుల రద్దీ, భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడి, ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు. అనంతరం గణేష్ మండపం వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాలు మరియు రాబోయే నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సురక్షిత ంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు భద్ర తా చర్యలు చేపడుతోందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ"భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను జరుపుకుందాం... పరస్పర సహకారంతో శాంతిభద్రతలను కాపా డుకుందాం.""గణనాథుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం వెల్లివిరియాలి." గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పోలీసు శాఖ సూచనలు మరియు భద్రతా నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఎస్పీ కోరారు.

## యంగ్ స్టార్ యూత్ వినాయకుని వద్ద అన్నప్రసాద వితరణ



**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 19**శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట లో యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని వినాయకుని వద్ద దాతల సహాయం తో అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి ప్లాస్టిక్ రహితంగా కార్యక్రమం నిర్వహించడం, హిందూ సాంప్రదాయ పద్ధతులలో మట్టి గణపతిని పెట్టి పూజించడం, బతుకమ్మ ఘాటు వద్ద మంచినీటి సౌకర్యం, స్కూల్ పిల్లలకు బూట్లు పంపిణీ లాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేస్తూ గ్రామంలో యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాం అన్నారు. ఈ సందర్భంగా యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యులను గ్రామ ప్రజలు గ్రామ నాయకులు అభినందించారు.

## సాంస్కృతిక ప్రతిభ పురస్కార్‌కు కళాకారులకు ఆహ్వానం

### - రాయికల్ మండల వ్యాప్తంగా నూతన, ప్రతిభావంతులైన కళాకారులకు అవకాశం



**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 19**జగిత్యాల జిల్లా రాయికల్ మండల వ్యాప్తంగా ఉన్న నూతన కళాకారులు, కళారంగంలో ఇప్పటికే రాణిస్తున్న కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రజా చైతన్య వేదిక--రాయికల్ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రతిభ పురస్కార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు చింతకుంట సాయి కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళా కారులు పాల్గొని తమలోని కళా ప్రతిభను ప్రదర్శించేందుకు చక్కటి అవ కాశం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గాయకులు, నృత్యకారులు, నటులు, దర్శకులు, రచయితలు తమ ప్రతిభను ప్రదర్శించి కళారంగంలో మరింతగా రాణి ఓంచాలని ఆయన కోరారు. వివిధ కళా విభాగాల్లో అవకాశం నాటన, గాయకులు డాన్స్, రచన, ఎ ఇతర కళ ప్రతిభ ఉన్న ఎంపిక చేసి ప్రదర్శనకు అవకాశం కల్పిస్తామని, ఇతర కళా ప్రదర్శనలు, కళాకారుల ప్రతిభకు అనుగుణంగా అవకాశం కల్పించబడుతుంది. ఎంట్రీ ఫీజు సింగిల్ కు :200/- గ్రూప్ కు :500/ చెల్లించాలని, ఎంట్రీ ఫీజు చెల్లించే స్థోమత లేని కళాకా రులకు ఉచితంగా అవకాశం కల్పించనున్నట్లు, ప్రతిభ ఉన్న ప్రతి కళాకారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 98499 09634 నంబర్‌ను సంప్రదించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో మినీ చిత్రాల దర్శకులు కురిసెంగ ప్రసన్న కుమార్ భాగస్వామిగా ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## అంగన్వాడీ లో గర్భిణీలకు సీమంతం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం



**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 19**జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలలో జాతీయ పోషణ మాసంలో భాగంగా ఆరోగ్యవంతమైన పిల్లల తల్లులు, పోషణ లోపం ఉన్న పిల్లల తల్లుల మధ్య అనుభవం పంచుకునే సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం అనంతరం గర్భిణీలకు సీమంతం ఆరు నెలలు నిండిన పిల్లల అన్నప్రాసన, మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్ట రాజ ఒదర్, ఉప సర్పంచ్ అగునూరి గంగరాజం, వార్డు మెంబర్లు కొక్కుల గణేష్, కుర్మా తిరుపతి, గ్రామ కార్యదర్శి హుమేరా, డాక్టర్ అనూష ఎం.ఎల్.హెచ్ పి, ఐసి డిఎస్ సూపర్వైజర్ లావణ్య, ఎ.ఎన్.ఎం శ్రీశైల, శిరీష, అంగన్వాడి టీచర్లు సంకోజి పద్మారాణి, జమున, శైలజ, ఆశ కార్యకర్త హేమలత, గర్భిణీలు, పిల్లల తల్లులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లాలాపేట్‌లో ఘనంగా గణేష్ ఉత్సవాలు



**సికింద్రాబాద్, వార్త మిర్రర్ , సెప్టెంబర్ 19:** లాలాపేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకుడు సీహెచ్ సునీల్ ముదిరాజ్ పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజల ు నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆయా ప్రాంతాల్లోని గణేష్ మండపాలను సందర్శించిన సునీల్ ముదిరాజ్, స్వామివారిని దర్శి ంచుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా సీహెచ్ సునీల్ ముదిరాజ్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు భక్తి, ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. లాలాపేట్‌లో ప్రజలు భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను అందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు, భక్తులు సీహెచ్ సునీల్ ముదిరాజ్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో మల్లికార్జున్, హనుమంత్, కిరణ్, గిరి, పద్మ, స్టాలిన్, గాయత్రి, వనజ తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ పట్టణ ప్రజలకు లో వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

### -రూ.30 లక్షలతో నాలుగు డీటీఆర్‌ల ఏర్పాటు



**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 19**జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న లో-వోల్టేజీ సమస్య పరిష్కారానికి రూ.30 లక్షల వ్యయంతో నాలుగు డీటీఆర్‌లు (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు) ఏర్పాటు చేయడం జరిగిందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు.రాయికల్ మండలంలో గృహజ్యోతి పథకం అమలుకు సుమారు రూ.11.70 కోట్ల వరకు నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కోసం అవసరమైన డీడీ చెల్లించిన వారికి విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాకు చర్యలుఈ వర్షాకాలంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పీక్ స్థాయికి చేరినప్పటికీ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్ అందించేందుకు 14 రూపాయలకు యూనిట్ చొప్పున ప్రభుత్వం విద్యుత్‌ను కొనుగోలు చేస్తోందని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఉచిత విద్యుత్‌తో పాటు రుణమాఫీ, రైతుభరోసా తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.మహిళల కోసం ఉచిత బస్సు ప్రయా ఓణంమహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనం కలుగుతోం దన్నారు. 2026 సెప్టెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, మహిళల ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.12,385 కోట్ల మేర ప్రయాణ ఖర్చు ఆదా అయిందని తెలిపింది అన్నారు. రాయికల్ పట్టణ, మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మైతాపూర్, రామాజీపేట బ్రిడ్జి పనులు పూర్తి చేశామని, మిగిలిన అప్రోచ్ రోడ్డు పనులను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. గతంలో సీనియర్ నాయకులు రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో పూర్తి కాలేని బ్రిడ్జి పనులను పూర్తి చేస్తామని అనా ్నరు. బోర్నపల్లి బ్రిడ్జికి నిధులు తానే కేటాయించానని చెప్పుకునే సీనియర్ నాయకులు బోర్నపల్లి, రేచపల్లి,తాట్లవాయి ప్రాంతాలకు సంబంధించిన ఫారెస్ట్ క్లియరెన్స్ ఎందుకు ఇప్పించలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. గతంలో మంజూరైన అభివృద్ధి పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నామని, దీంతో కొత్త అభివృద్ధి పనులను కూడా ప్రారంభించేందుకు అవకాశం ఏర్పడుతోందన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా రాయికల్ పట్టణ, మండల అభివృద్ధి మాత్రం ఆగదని ఎమ్మెల్యే డా. సం జయ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ రాయి కల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. రాజకీయాలు ఎన్నికల వరకే అని అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు సర్పంచులు రాయికల్ పట్టణ మండల నాయకులు విద్యుత్ అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

### - టీజీఐఐసీ కాలనీలో భక్తిశ్రద్ధలతో గణనాథునికి ప్రత్యేక పూజలు



**కాప్రా, వార్త మిర్రర్,సెప్టెంబర్ 19 :** ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని టీజీఐఐసీ కాలనీలో యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణనాథుని సన్నిధిలో వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గణనాథుని దర్శించుకునేందుకు వచ్చిన వేలాది మంది భక్తులకు యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త నాగ ఫణీంద్ర, యువసేన యూత్ అసోసియేషన్ చైర్మన్ సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు సహా పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు దోపదపడతాయని అన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. యువత ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు భక్తుల కోసం అన్నప్రసాద వితరణ వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొంటున్న భక్తులు, స్థానికులు, నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యువసేన యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, కాలనీ పెద్దలు, స్థానికులు, మహిళలు, యువత, భక్తుల సంఖ్యలో పాల్గొన్నారు.

## నీట్‌ను రద్దు చేయాలి: దక్షిణాది విద్యార్థి సంఘాల డిమాండ్



**సికింద్రాబాద్, వార్త మిర్రర్ సెప్టెంబర్ 17**: పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతూ, విద్యార్థులపై తీవ్ర ఒత్తిడికి కారణమవుతున్న నీట్ (చీజుజు) పరీక్షను రద్దు చేయాలని దక్షిణ జనతా పార్టీ విద్యార్థి విభాగం 'దక్షిణ స్టూడెంట్ ఫెడరేషన్' డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.సదస్సులో డీజేపీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, బీఆర్ఎస్ నాయకుడు వినోద్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కేంద్రీకృత వైద్య ప్రవేశ పరీక్ష విధానం వల్ల తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు నష్టపోతున్నారని వారు ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు చెందిన ఎంబీబీఎస్ సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులు పొందే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కేంద్రీకృత వైద్య విద్యా విధానాలను పునఃసమీక్షించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని కాపాడుతూ, ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా వైద్య విద్య ప్రవేశ విధానాన్ని రూపొందించుకునే అవకాశం కల్పించాలని కోరారు. నీట్, ఎన్‌టీఏ విధానాల నుంచి మినహాయింపు కోరుతున్న దక్షిణాది రాష్ట్రాలకు ప్రత్యేక అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.తెలంగాణతో పాటు ఇతర దక్షిణాది రాష్ట్రాల్లోని ఎంబీబీఎస్ సీట్లలో స్థానిక విద్యార్థులకు తగిన ప్రాధాన్యం దక్కేలా మెడికల్ కౌన్సిల్ చట్టంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిపై కేంద్ర ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ వైద్య, ఇతర విద్యా విధానాలకు వ్యతిరేకంగా దక్షిణాది '+వఅ-' ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని వారు విద్యార్థులకు పిలుపునిచ్చారు.

# వినాయకుని వద్ద జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు..

## - పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత.
## - జిల్లా జడ్జి రత్న పద్మావతి..



**వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 19** జగిత్యాల జిల్లా కోర్టులో గణపతి నవరాత్రులను పురస్కరించుకొని కోర్టు ప్రాంగణంలో ప్రతిష్టించిన వినాయకునికి ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గౌరవనీయులు శ్రీమతి శ్రీ రత్న పద్మావతి గారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ఏర్పాటు చేసిన బట్ట సంచుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నేటి రోజుల్లో ఉదయం మేలుకున్న తర్వాత మొదలుకొని రాత్రి నిద్రించేవరకు నిత్య జీవితంలో ప్లాస్టిక్ వస్తువులు ప్లేట్స్,గ్లాసులు, క్యారి బ్యాగ్స్ మొదలగు వస్తువుల వాడకం ఎక్కువైందని ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ మహమ్మారి బారిన పడే అవకాశం ఉన్నందున ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేసి స్వచ్ఛమైన వాతావరణంలో జీవన మనుగడ సాగించేందుకు ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కోర్టు సిబ్బందికి, న్యాయవాదులకు, కక్షిదారులకు ఇతరులకు బట్ట సంచులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి సునీత రవీందర్ రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్ రావు, రెండవ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ నిఖిషా కరంజియా, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్ర నర్సయ్య, ఉపాధ్యక్షులు మర్రిపెల్లి సత్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శి అందే మారుతి, న్యాయవాదులు ముదిగంటి జనార్దన్ రెడ్డి, బండ భాస్కర్ రెడ్డి, రాచకొండ శ్రీరాములు, శ్రీపాల్ రెడ్డి, మారిశెట్టి ప్రతాప్, బెత్తెపు లక్ష్మణ్, ఎనగంటి రామచంద్రం, చిలుకమర్రి మదన్ మోహన్, కే.చంద్రమోహన్, ఆర్.గంగారెడ్డి, జున్ను రాజేందర్, నేరెల్ల మహేష్, తుమ్మనపెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

## - జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్
## -సెప్టెంబర్ 27న రాయికల్ శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలు
## -“డిజిటల్ అజెండా, కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్రూపకల్పన” ఈ ఏడాది థీమ్



**వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్-19:**ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 27న జగిత్యాల జిల్లాలోని రాయికల్ లోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యాటక రంగం ప్రాధాన్యత, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి, సుస్థిర అభివృద్ధిలో పర్యాటక రంగం పోషించే కీలక పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. 2026 సంవత్సరానికి “డిజిటల్ అజెండా, కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్రూపకల్పన” అనే థీమ్‌ను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై ఈ నెల 09న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాయికల్‌లోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం) లో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

# సీనియర్ పాత్రికేయులు సయ్యద్ రసూల్ కు సన్మానం




**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 19** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు సయ్యద్ రసూల్ ను ప్రముఖ రచయిత వేముల ప్రభాకర్ గౌడ్ ఘనంగా సన్మానించారు. రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సహకారసంఘాల సబ్ రిజిస్ట్రార్ గా పదవీ విరమణ పొందిన రచయిత ప్రభాకర్ గౌడ్ తాను విద్యనభ్యసించిన పాఠశాలను చూడడానికి వచ్చిన సందర్భంలో పాఠశాల లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు కై నిధులు విరాళంగా అందజేస్తానని ప్రకటించారు. పాఠశాల పూర్వ విద్యార్థి పత్రిక విలేఖరి గా రాణిస్తున్న సయ్యద్ రసూల్ ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పి.రాజశేఖర్, చెరుకు మహేశ్వర శర్మ, పి రమేష్, జి తరంగిణి, ఎం రమ, పి సృజన, సిఆర్పి కె.రవీందర్, జూనియర్ అసిస్టెంట్ శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జీకేజీ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం...



**మాదాపూర్ వార్త మిర్రర్ :** మాదాపూర్ డివిజన్ పరిధిలోని గుట్టల బేగంపేట్ లో జీకేజీ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ అన్నదానంలో స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నిరుపేదలకు, వృద్ధులకు కడుపునిండా భోజనం పెట్టడం ఎంతో సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో జీకేజీ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్, సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు చెప్పారు.

# ఇ ఎల్.వి ఫౌండేషన్ భాస్కర్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ లో మెగా జాబ్ మేళా

## - ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ డా.ఇరుగదిండ్ల భాస్కర్



**వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి సెప్టెంబర్ 19** చౌటుప్పల్‌లో మున్సిపల్ పరిది లక్కారంలోని వివిఆర్ గార్డెన్ లో శనివారం ఈఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను ఈ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ డా:ఇరుగుదిండ్ల భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేళాకు 75కు పైగా కంపెనీలు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా 3000 మంది అభ్యర్థులు హాజరవ్వగా 500 మం దికి పైగా అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. వివిధ ప్రైవేట్ సంస్థలు, కంపెనీ ల ప్రతినిధులు పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేశారు .యువ తకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈఎల్‌వీ ఫౌండేషన్ చేపడు తున్న కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఈఎల్‌వీ భాస్కర్ మాట్లాడుతూ యువతలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి ఉపాధి అవకా శాలు కల్పించేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఈ ఎల్ వి భాస్కర్ టీం,తదితరులు,పాల్గొన్నారు..

# ప్రశాంత్ నగర్ కాలనీలో యోగా మండపాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, నేలపాటి రామారావు



**ఎల్బీనగర్,19 సెప్టెంబర్:**వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ లో నూతనంగా నిర్మించిన యోగా మండపాన్ని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ కాలనీ వాసులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథున్ని మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగస్వామ్యం అయిన చిన్నారులకు ఈ సందర్భంగా మధు యాష్కి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు కర్ణాకర్ రెడ్డి, యు వి ఎన్ బాబు, అంజయ్య యాదవ్, జి. గోపాల్ రెడ్డి, నందా రెడ్డి, నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

# ముదిరాజ్ ల బహిరంగ సభను విజయవంతం చేయాలి..

## చొక్కాల రాము ముదిరాజ్..




**సికింద్రాబాద్, వార్త మిర్రర్ సెప్టెంబర్ 19**..ముదిరాజ్‌లను బిసి - డి నుంచి బీసీఏ లోకి మార్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న జిల్లాలో తలపెట్టిన ముదిరాజ్ ల బహిరంగ సభను విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ముదిరాజ్ కోరారు. ఈ మేరకు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లను బిసిడి నుంచి బి సి ఎ కి మారుస్తామని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తరతరాలుగా 60-70 సంవత్సరాలుగా తమ పోరాటం కొనసాగుతోందని, ముదిరాజ్‌లు బుట్టలు అల్లుతూ, సీతాఫలాలు అమ్ముకుంటూ, చేపలు పడుతూ, చెట్లు ఎక్కుతూనే జీవనం సాగిస్తున్నారని, పేరుకే బిసిడి లో ఉన్నా ఏ ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి తమను గుర్తించి బిసి డి నుంచి బి సి ఎ కి మార్చడం జరిగిందని, అయితే కొంతమంది అడ్డుకోవడం వల్ల అది ఆగిపోయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజులను బీసీ డి నుంచి బీసీఏలోకి మార్చాలని లేనిపక్షంలో మిలియన్ మార్చ్ చేపడతామని హెచ్చరించారు.

# శిక్షణార్థులకు డిజిటల్, ఆర్థిక అక్షరాస్యత




**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 19**

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ పొందుతున్న యువతకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిజిటల్,ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ మధుసూదన్ మాట్లాడుతూ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సురక్షితంగా వినియోగించుకోవాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ నరేష్ మాట్లాడుతూ పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై బీమా పథకాలతో పాటు స్వయం ఉపాధి రుణాలపై వివరించారు.

**ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**

రాయికల్ మండలం లోని నిరుద్యోగ యువత ఉచిత వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధి సాయి శ్రీనివాస్ అన్నారు. శనివారం రాయికల్ పట్టణం లో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ప్రతినిధులు సాయి శ్రీనివాస్, మహేష్, జీయర్ స్వామి ట్రస్ట్ ఇన్చార్జి ఏ.ఎం రాజు రెడ్డి, ఆర్గనైజర్ రఘుపతి, సిబ్బంది ప్రమోద్, నాగేందర్, చిరంజీవి, కృష్ణవేణి,వనిత పాల్గొన్నారు.